RNI NO:APTEL /2023/90201

POST REGD NO :NSV/15/2026-28

రాజధాని

తెలుగు దినపత్రిక

వాయిస్

web : www.rajadhanivoice.in

rajadhanivoicedaily@gmail.com

రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కోనసాగుటకు

గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు

నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు

మండలాల వారిగా విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించగలరు.

9030343195

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 353 | 13 శుక్రవారం నవంబర్ 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

ఏపీలో భారీ పెట్టుబడులకు క్లీన్ మాక్స్ ఆసక్తి

ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుల్లో రూ.36వేలకోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ క్లీన్ మాక్స్ ఛైర్మన్ కుల్ దీప్‌తో మంత్రి లోకేష్ భేటీ



విశాఖపట్నం, రాజధాని వాయిస్ : క్లీన్ మాక్స్ సంస్థ ఛైర్మన్ ఉ మేనేజింగ్ డైరెక్టర్ కుల్ దీప్ జైన్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ భేటీ అయ్యారు. మంత్రి లోకేష్ తో చర్చల అనంతరం ఆంధ్రప్రదేశ్ లో భారీ పెట్టుబడులకు క్లీన్ మాక్స్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. రూ.36,000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పునరుత్పాదక ఇంధన, విద్యుత్ పంపిణీ, పంప్డ్ స్టోరేజ్, డేటా సెంటర్ పార్క్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. 4 జీడబ్ల్యూ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై రూ.28వేల కోట్లు (3 జీడబ్ల్యూ విండ్, 1 జీడబ్ల్యూ సోలార్), పునరుత్పాదక వనరులు సమృద్ధిగా ఉన్న టైర్-2 నగరంలో సొంత విద్యుత్ పంపిణీతో 1 జీడబ్ల్యూ (ఐటీ లోడ్) డేటా-సెంటర్ పార్క్ పై సుమారు రూ.2,000 కోట్లు, 1 జీడబ్ల్యూ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులపై రూ.6,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు సంస్థ ఛైర్మన్ కుల్ దీప్ జైన్ వెల్లడించారు. తమ సంస్థ ఆధ్వర్యాన ఇప్పటికే శ్రీ సత్యసాయి జిల్లా, పరిగి మండలం, బీచిగానిపల్లె, పరిసర గ్రామాల్లో రూ.1,200 కోట్లతో 200 మెగావాట్ల సోలార్ పార్క్ భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్ లో 2029 నాటికి 25 జీడబ్ల్యూహెచ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) సామర్థ్యానికి అనుగుణంగా క్లీన్ మాక్స్ విండ్-సోలార్ హైబ్రిడ్ లో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) ను అనుసంధానం చేయాలని కోరారు.

రాష్ట్రానికి 714 ప్రాజెక్టులు...రూ.22.61 లక్షల కోట్ల పెట్టుబడులు: మంత్రి పార్థసారథి

విజయవాడ, రాజధాని వాయిస్ : 2024, జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి రూ.22.61 లక్షల కోట్ల విలువైన 714 ప్రాజెక్టుల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుందని రాష్ట్ర గృహనిర్మాణ, పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. విశాఖ నగరంలోని సీఐఐ సదస్సు ప్రాంగణంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 526 ప్రాజెక్టులకు అవసరమైన భూములతోపాటు ప్రోత్సాహకాలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. రూ.7.30 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయన్నారు. పెద్ద ఎత్తున జలవనరుల ప్రాజెక్టులు చేపడుతున్నామని వివరించారు. ఏటా రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల విలువైన ఉపాధిహామీ పనులను చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. పారిశ్రామికవేత్తలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. చదువుతోపాటు నైపుణ్యాలు నేర్పించడం, ఉపాధి అవకాశాల కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

2026--27లో ఐదు లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం: సీఎం చంద్రబాబు



విశాఖలో తొలి మహిళా--వృద్ధి సదస్సు

మహిళల ఆర్థిక భాగస్వామ్యంపై విస్తృత చర్చలు

మహిళా నేతృత్వంలోని సంస్థలకు ప్రోత్సాహం

యజమానులు, నాయకులుగా మహిళలను తీర్చిదిద్దడంపై దృష్టి

విశాఖపట్నం, రాజధాని వాయిస్ : దేశ నిర్మాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని, సమ్మిళిత ఆర్థిక వృద్ధి, ఆవిష్కరణలు, సంపద సృష్టికి వారు ప్రధాన చోదకశక్తులని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మహిళల సాధికారత కేవలం ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యానికే పరిమితం కాకూడదని, సంస్థల యాజమాన్యం, నాయకత్వం, నిర్ణయాధికారంలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని అభిప్రాయపడ్డారు. ఈ దిశగా మహిళలకు మరిన్ని అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా నిర్వహించిన మహిళా--వృద్ధి సదస్సు 2026లో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ, శోభనా కామినేని, సీఐఐ ప్రతినిధి చంద్రజిత్ బెనర్జీ, పారిశ్రామిక రంగ ప్రముఖులు, మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి వివిధ అంశాలపై చర్చించారు. - మిగతా 2లో..

అల్లూరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వంతల శాంతి ఎంపిక

వైస్ చైర్‌పర్సన్‌గా సీదరి రాంబాబు

తాడేపల్లిలో అధికారికంగా ప్రకటించిన వైఎస్ జగన్

సామాజికవర్గాల సమన్యాయమే ఎంపిక లక్ష్యం



తాడేపల్లి, రాజధాని వాయిస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎంపికలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో జిల్లాకు చెందిన నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పెదబయలు జడ్పీటీసీ వంతల శాంతిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా, పాడేరు జడ్పీటీసీ సీదరి రాంబాబును వైస్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయంతో జిల్లా పరిషత్ నాయకత్వ బాధ్యతలను ఇద్దరు జడ్పీటీసీ సభ్యులకు అప్పగించేందుకు పార్టీ నిర్ణయించింది. పెదబయలు జడ్పీటీసీ వంతల శాంతి ఎస్టీ కోదు సామాజికవర్గానికి చెందినవారు. ఆమెను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎంపిక చేయగా, పాడేరు జడ్పీటీసీ సీదరి రాంబాబు కొండదొర సామాజికవర్గానికి చెందినవారు. ఆయనకు వైస్ చైర్‌పర్సన్ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించారు. - మిగతా 2లో..

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు సమన్వయంతో పనిచేయాలి: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ

విజయవాడ, రాజధాని వాయిస్ : రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్లు, పోలీసు సూపరింటెండెంట్లు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతల పరిరక్షణ, పటిష్టమైన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ మాట్లాడుతూ.. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సమస్యాత్మక జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్న సందర్భాలు ఉన్నాయని, సుప్రీంకోర్టు జోక్యం, పటిష్టమైన భద్రతా ఏర్పాట్లతో ఎన్నికల నిర్వహణలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, పట్టణ స్థానిక



సంస్థల ఎన్నికలను అధికారులు, పోలీసు యంత్రాంగం సమష్టి కృషితో విజయవంతంగా నిర్వహించారని పేర్కొన్నారు. - మిగతా 2లో..

మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుంది: డా. రాయపాటి శైలజ

విశాఖపట్నం, రాజధాని వాయిస్ : మహిళలు ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములైతే రాష్ట్రంతో పాటు దేశం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డా. రాయపాటి శైలజ అన్నారు. విశాఖపట్నంలో జరుగుతున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ -- 2026లో భాగంగా నిర్వహించిన మహిళాభివృద్ధి సదస్సులో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళల ఆర్థిక భాగస్వామ్యం, మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహం, నాయకత్వ అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న అడ్డంకులపై నిర్వహించిన ప్యానెల్ చర్చలో తన అభిప్రాయాలను వెల్లడించారు.జాతీయ సగటు 40 శాతంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మహిళల నేతృత్వంలోని ఎంఎస్ఎంఈలు 53 శాతంగా ఉన్నాయని తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వాములు కావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని, ముఖ్యంగా మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుగారు ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. ఒక మహిళ ఆర్థికంగా ఎదిగితే ఆ కుటుంబం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నది ముఖ్యమంత్రి ఆలోచన అని వివరించారు.మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉంటే సంస్థలు, పరిశ్రమలకు కూడా ప్రయోజనం చేకూరుతుందని, అయితే వారు ఎదుర్కొంటున్న అడ్డంకులను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా మహిళల పట్ల సమాజం ఆలోచనా విధానంలో మార్పు రావాలని సూచించారు.మహిళలు మెటర్నిటీ లీవ్‌పై వెళ్లడాన్ని వారి ఎదుగుదలకు అడ్డంకిగా చూడకూడదని, అది చట్టబద్ధంగా లభించిన హక్కు అని స్పష్టం చేశారు. ఆ హక్కును గౌరవిస్తూనే పరిశ్రమలు, సంస్థల్లో మహిళల అభివృద్ధికి సహకరించాలని డా. రాయపాటి శైలజ పేర్కొన్నారు.

శ్రీలంక, రష్యాతో ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య బంధాల విస్తరణకు చర్చలు

ఇరు దేశాల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు భేటీ

వస్త్ర, పర్యాటక రంగాల్లో పెట్టుబడులకు శ్రీలంకతో చర్చలు

రక్షణ, అల్యూమినియం, సముద్ర ఉత్పత్తులపై రష్యాతో సంప్రదింపులు

వాణిజ్యం, రవాణా, పరిశోధన రంగాల్లో సహకారానికి ప్రతిపాదనలు



అమరావతి, రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్‌లో అంతర్జాతీయ పెట్టుబడులు, వాణిజ్య అవకాశాలను విస్తరించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీలంక, రష్యా దేశాల ప్రతినిధులతో కీలక సమావేశాలు నిర్వహించారు. భారతదేశంలో శ్రీలంక హైకమిషనర్ మహిషిణి కొలొన్నె, రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో విడివిడిగా సమావేశమై రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, వివిధ రంగాల్లో పరస్పర సహకారంపై చర్చించారు. రెండు దేశాలతో ఆర్థిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు కొత్త వాణిజ్య, పారిశ్రామిక అవకాశాలు తీసుకురావడమే లక్ష్యంగా ఈ భేటీలు జరిగాయి. సీఐఐ భాగస్వామ్య సదస్సు నేపథ్యంలో అంతర్జాతీయ పెట్టుబడిదారులతో సంబంధాలను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు కొనసాగిస్తోంది. శ్రీలంక హైకమిషనర్ మహిషిణి కొలొన్నెతో జరిగిన సమావేశంలో వస్త్ర, దుస్తుల తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే అంశంపై ప్రధానంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఈ రంగాల అభివృద్ధికి ఉన్న అవకాశాలను వినియోగించుకోవడం, శ్రీలంక సంస్థల భాగస్వా మ్యాన్ని పెంచుకోవడంపై అభిప్రాయాలు పంచుకున్నారు. - మిగతా 2లో..

మీ కలతోపాటు.. ఆంధ్రప్రదేశ్ కలనూ నిజం చేయండి: పవన్ కల్యాణ్

విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఉప ముఖ్యమంత్రి ప్రసంగం

రాష్ట్రంలో పెట్టుబడులకు పూర్తి భద్రత, వేగంగా అనుమతులు కల్పిస్తామని భరోసా

గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోనూ పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు పిలుపు

చిన్న పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తూ స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచాలని సూచన



విశాఖపట్నం, రాజధాని వాయిస్ : ఆంధ్రప్రదేశ్ అవకాశాలకు నిలయమని, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను పారిశ్రామికవేత్తల ఆశయాలతో అనుసంధానించి ముందుకు సాగాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. పెట్టుబడిదారులు స్పష్టమైన దూరదృష్టితో రాష్ట్రానికి వచ్చి పెట్టుబడులు పెట్టాలని, వారి ఎదుగుదలకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు భద్రత కల్పించడం, పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను వేగంగా మంజూరు చేయడం ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు తమ భవిష్యత్తుపై నమ్మకంతో ముందడుగు వేస్తే, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవుతారని పేర్కొన్నారు.విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సులో పవన్ కల్యాణ్ పాల్గొని ప్రసంగించారు. ఈ సదస్సుకు 58 దేశాల నుంచి సుమారు 3,800 మంది ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. సదస్సుకు ముందు మంత్రి నారా లోకేశ్ ఉప ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా సమావేశమై రాష్ట్రానికి రానున్న పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు సంబంధించిన అంశాలను వివరించారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన - మిగతా 2లో..

మీ కలతోపాటు.. ఆంధ్రప్రదేశ్ కలనూ నిజం చేయండి: పవన్ కల్యాణ్

పారిశ్రామిక నమూనాలను పవన్ కల్యాణ్ పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌కు 1,053 కిలోమీటర్ల తీరప్రాంతం ఉండటం, ఆగ్నేయాసియా దేశాలకు అనుసంధానంగా ఉండే భౌగోళిక స్థానం పెట్టుబడులకు అనుకూలమని పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రంలో ప్రతిభావంతులైన యువత, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, నూతన ఆలోచనలకు కొదవ లేదన్నారు. 1995 నుంచి సీఐఐ సదస్సుల ద్వారా ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి పనిచేస్తున్నారని గుర్తుచేశారు. 2024 సీఐఐ సదస్సులో 714 సంస్థలతో రూ.22.6 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదిరాయని, వాటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇటీవల కాకినాడలో జరిగిన ప్రాంతీయ సదస్సులో 15 అవగాహన ఒప్పందాల ద్వారా రూ.4,256 కోట్ల పెట్టుబడులు, 14 వేల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు జరిగాయని వివరించారు.ప్రస్తుత సదస్సు ద్వారా 150 అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొని రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. భారీ పరిశ్రమలతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కోరారు. అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పరిశ్రమలు తోడ్పడాలని చెప్పారు. పెట్టుబడుల ఒప్పందాలు కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశ్రమల కార్యకలాపాలు త్వరగా ప్రారంభమై వాటి ఫలితాలు ప్రజలకు అందాలని ఆకాంక్షించారు.రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే సంస్థలకు ప్రభుత్వం అవసరమైన సహకారం అందిస్తుందని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు. పరిశ్రమల అభివృద్ధితోపాటు పర్యావరణ



పరిరక్షణకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని పారిశ్రామికవేత్తలకు సూచించారు. ఉత్పత్తి, లాభాలకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలు, స్థానిక మానవ వనరుల సామర్థ్యాన్ని గుర్తించి పెట్టుబడులు పెట్టాలని కోరారు. ప్రకృతికి నష్టం కలగకుండా బాధ్యతాయుతమైన పారిశ్రామిక కార్యకలాపాలు నిర్వహించేందుకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎంపీలు, సీఐఐ ప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


2026--27లో ఐదు లక్షల మంది మహిళా పారిశ్రామికవేత్తలే లక్ష్యం: సీఎం చంద్రబాబు



మహిళల ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, వ్యాపార రంగంలో మహిళల ప్రవేశాన్ని ప్రోత్సహించడం, పరిశ్రమల్లో వారికి మరిన్ని అవకాశాలు కల్పించడం వంటి అంశాలు ఈ సమావేశంలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.మహిళా పారిశ్రామికవేత్తలకు పెట్టుబడులు, మూలధనం అందుబాటును మెరుగుపరచడం, కొత్త వ్యాపారాలను ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందించడం వంటి అంశాలపై చర్చలు జరిగాయని చంద్రబాబు తెలిపారు. వివిధ పరిశ్రమల్లో మహిళల భాగస్వామ్యాన్ని విస్తరించడంతో పాటు, వారు స్వతంత్రంగా వ్యాపారాలను నిర్వహించే స్థాయికి ఎదిగేందుకు అనుకూల వాతావరణం కల్పించాల్సిన అవసరాన్ని వివరించారు. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా, వ్యాపార సంస్థల యజమానులు, పారిశ్రామికవేత్తలు, నాయకులుగా తీర్చిదిద్దడమే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మహిళల నేతృత్వంలోని సంస్థలను బలోపేతం చేయడం, పాలనలో వారి పాత్రను విస్తరించడం, ఆర్థిక స్వావలంబనకు మార్గాలు కల్పించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తోందన్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఐదు లక్షల మంది మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే ప్రతిష్ఠాత్మక లక్ష్యాన్ని ప్రభుత్వం నిర్దేశించుకుందని చంద్రబాబు వెల్లడించారు. ఈ లక్ష్య సాధన కోసం మహిళా ఆధ్వర్యంలోని వ్యాపార సంస్థలకు ప్రోత్సాహం, ఆర్థిక వనరులకు మెరుగైన అందుబాటు, నాయకత్వ అవకాశాల విస్తరణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. మహిళలు యజమానులుగా, నిర్ణయాధికారులుగా ఎదిగినప్పుడే నిజమైన సాధికారత సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి - ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ
- అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి - పోలింగ్ కేంద్రాలు, భద్రతపై ప్రత్యేక దృష్టి - సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలి



కడప, రాజధాని వాయిస్ నవంబర్ 12 : జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో ప్రశాం తంగా, కట్టుదిట్టంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానున్న నేపథ్యంలో యంత్రాంగం ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలన్నారు.గురువారం రాష్ట్ర రాజధాని నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లాల్లో చేపట్టిన ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సమావేశానికి కడప కలెక్టరేట్‌లోని బోర్డు సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా హాజరయ్యారు.ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నేపథ్యంలో జిల్లాలో ఇప్పటివరకు చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, అధికారుల బాధ్యతలు, ఎన్నికల సిబ్బంది నియామకం తదితర అంశాలను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన ఏర్పాట్లపై కలెక్టర్లు, ఎస్పీలకు పలు సూచన లు చేశారు. ఎన్నికల సంఘం జారీ చేసే మార్గదర్శకాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని స్పష్టం చేశారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ఎన్నికలను పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఆదేశాలను తూచా తప్పకుండా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, సిబ్బంది నియామకం, విధుల కేటాయింపు, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి బాధ్యతలను స్పష్టంగా అప్పగించా లన్నారు. ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారికి సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

అధికార బలంతో డీలిమిటేషన్ బిల్లుకి ఆమోదం దొరకదు: కాంగ్రెస్

డీలిమిటేషన్ బిల్లుని పార్లమెంటులో ఆమోదం చేయిస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పిన మాటలపై కాంగ్రెస్ స్పందించింది. అమిత్ షా నియోజక వర్గాల పునర్విభజన ప్రస్తావం మళ్లీ తీసుకొచ్చారని ఎద్దేవా చేసింది. గతంలో ఆయన లోక్‌సభలో డీలిమిటేషన్ బిల్లు ఆమోదానికి ప్రయత్నించి ఓటమిని ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలకు పార్లమెంటు ఆమోదం పొందడానికి ఈ ఏడాది ఏప్రిల్ 16, 17 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లుని తీసుకొచ్చింది. పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని ఇలాగే కొనసాగిస్తూ సీట్లు పెంచుతామని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా సభాముఖంగా అన్ని పక్షాలకూ హామీ ఇచ్చారు.

శ్రీలంక, రష్యాతో ఆంధ్రప్రదేశ్ అంతర్జాతీయ వాణిజ్య బంధాల విస్తరణకు చర్చలు

అలాగే సముద్ర తీర పర్యాటకం, ఆతిథ్య రంగం, వ్యవసాయం, ఆక్వాకల్చర్ రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఈ రంగాల్లో పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, వ్యాపార సంబంధాల ద్వారా ఇరు ప్రాంతాలకు ప్రయోజనం కలిగే అంశాలను చర్చించారు.కొలంబో--విశాఖపట్నం మధ్య విమాన, సముద్ర రవాణా అనుసంధానాన్ని మెరుగుపరచడంపైనా చంద్రబాబు ప్రత్యేకంగా చర్చించారు. రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు, సరుకు రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకం, వాణిజ్యం మరింత విస్తరించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా సముద్ర మార్గాల అనుసంధానం ద్వారా ఎగుమతులు, దిగుమతులకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని చర్చించారు. శ్రీలంకతో ఇప్పటికే ఉన్న భౌగోళిక, వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు రవాణా రంగంలో సహకారం కీలకమని సమావేశంలో ప్రస్తావించారు.రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్‌తో జరిగిన సమావేశంలో అల్యూమినియం తయారీ, రక్షణ రంగం, అంతరిక్ష, విమానయాన రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చలు జరిగాయి. రాష్ట్రంలో అల్యూమినియం పరిశ్రమల అభివృద్ధికి పెట్టుబడులను ఆకర్షించడం, రక్షణ, వైమానిక రంగాల్లో సాంకేతిక సహకారాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలను చంద్రబాబు ప్రస్తావించారు. సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు రష్యా మార్కెట్‌లో ఉన్న అవకాశాలను కూడా పరిశీలించారు. ఈ రంగాల్లో వాణిజ్య సంబంధాలను విస్తరించేందుకు ఇరు దేశాల మధ్య సమన్వయం అవసరమని చర్చించారు.పట్టణ రవాణా రంగంలో మెట్రో రైలు, ఇతర నగర రవాణా వ్యవస్థల అభివృద్ధికి రష్యాతో సహకారం పొందే అవకాశాలపైనా సమావేశంలో చర్చించారు. మౌలిక సదుపాయాల కల్పనలో అనుభవం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకోవడం ద్వారా రాష్ట్రంలోని పట్టణాల అభివృద్ధికి తోడ్పడే అంశాలను పరిశీలించారు. విద్యాసంస్థల మధ్య సంబంధాలు, పరిశోధన,



సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాలను ప్రోత్సహించడంపైనా అభిప్రాయాలు పంచుకున్నారు. పారిశ్రామిక రంగంతో పాటు విద్య, పరిశోధన, సాంస్కృతిక రంగాల్లోనూ ఇరు దేశాల మధ్య సంబంధాలను విస్తరించేందుకు అవకాశాలున్నాయని చర్చించారు.శ్రీలంక, రష్యా ప్రతినిధులతో జరిగిన ఈ సమావేశాలు ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడులు, వాణిజ్య భాగస్వామ్యాలను పెంచుకునే దిశగా ఉపయోగపడతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. వస్త్ర పరిశ్రమలు, పర్యాటకం, వ్యవసాయం, ఆక్వాకల్చర్, అల్యూమినియం తయారీ, రక్షణ, రవాణా వంటి కీలక రంగాల్లో కొత్త అవకాశాలకు మార్గం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశోధన, విద్య, సాంస్కృతిక మార్పిడి ద్వారా కూడా అంతర్జాతీయ సంబంధాలను బలోపేతం చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, ఎగుమతుల అవకాశాలు తీసుకురావడమే లక్ష్యంగా ఈ చర్చలను ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

ఎన్నికల షెడ్యూల్‌పై సమీక్ష
ఇప్పటికే నిర్వహించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు తొలి విడతలో 100 పట్టణ స్థానిక సంస్థలకు ఎన్నికల ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. తదుపరి ఎంపీపీ అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 19 న, జెడ్పీపీ చైర్మన్ ఎన్నికలు నవంబర్ 20 న నిర్వహించనున్నట్లు వెల్లడిం చారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు నవంబర్ 12 న నోటిఫికేషన్ జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించి నవంబర్ 26 న పోలింగ్, నవంబర్ 30 న ఓట్ల లెక్కింపు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాల కలెక్టర్ల నుంచి అందిన అభిప్రాయాలు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుని కౌంటింగ్ తేదీలో మార్పు చేసినట్లు వివరించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు
రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు. మొదటి విడతకు నవంబర్ 13 న, రెండో విడతకు నవంబర్ 16 న, మూడో విడతకు నవంబర్ 19 న నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వెల్లడించారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన నవంబర్ 26 న, రెండో విడత నవంబర్ 29 న, మూడో విడత డిసెంబర్ 2న నిర్వహించనున్నట్లు తెలిపారు. మిగిలిన 23 పట్టణ స్థానిక సంస్థలకు పరోక్ష ఎన్నికలు డిసెంబర్ 3 న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొత్తంగా డిసెంబర్ 3 లేదా 4 వ తేదీ నాటికి రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
కొన్ని జిల్లాల్లో పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాల్సి రావడం సవాలుతో కూడుకున్న అంశమని కమిషనర్ పేర్కొన్నారు. స్థానిక సమస్యలు, వ్యక్తిగత విభేదాలు, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు ముందస్తు ప్రణాళికతో భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.అక్టోబర్ 27 న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మార్గదర్శకాలను అనుసరిస్తూ ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల దాఖలుకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవసరమైన చోట జిల్లా ప్రధాన కార్యాలయాలు, కలెక్టరేట్లలో నామినేషన్ పత్రాల స్వీకరణకు ఏర్పాట్లు చేయడంతో పాటు, దూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులకు రవాణా, భద్రతాపరమైన ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో అభ్యర్థులకు తగిన పోలీసు రక్షణ కల్పించాలని ఆదేశించారు.

సీసీటీవీ నిఘా, వీడియో రికార్డుల భద్రత తప్పనిసరి
అన్ని నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీటీవీ కెమెరాలు లేదా వీడియోగ్రఫీ ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఎన్నికలకు సంబంధించిన వీడియో రికార్డులను కనీసం 60 రోజుల పాటు లేదా ఎన్నికల పిటిషన్ల పరిష్కారం పూర్తయ్యే వరకు భద్రపరచాలని ఆదేశించారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సమస్యాత్మక ప్రాంతాలను ముందుగానే గుర్తించి తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి దశలో ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలయ్యేలా చూడాలని సూచించారు. 10 వేల కంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రతి పంచాయతీకి ప్రత్యేక రిటర్నింగ్ అధికారి.. ఎన్నికల వీడియో రికార్డుల భద్రతపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా పాటించాలివీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ఎన్నికల కార్యదర్శి డా. ఏ. మల్లిఖార్జు మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్ల స్వీకరణ, రిటర్నింగ్ అధికారుల నియామకం, సీసీటీవీ నిఘా, వీడియోగ్రఫీ, ఎన్నికల విధుల నిర్వహణపై నిర్దేశించిన మార్గదర్శకాలను అధికారులు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిబంధనల అమలు, సమన్వయానికి ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ కోసం రెండు నుంచి నాలుగు గ్రామ పంచాయతీలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ క్లస్టర్‌కు ఒక నామినేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఒక ప్రధాన లేదా అనువైన గ్రామ పంచాయతీలో రిటర్నింగ్ అధికారి వివరించారు.

అల్లూరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వంతల శాంతి ఎంపిక

ఇద్దరి ఎంపికను వైఎస్ జగన్ పార్టీ నాయకుల సమక్షంలో ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని స్థానిక సంస్థల నాయకత్వానికి సంబంధించి ఈ ప్రకటన వెలువడింది.అన్ని సామాజికవర్గాలకు సమన్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎంపికలు చేపట్టినట్లు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం వెల్లడించారు. జిల్లాలోని వివిధ సామాజికవర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే లక్ష్యంతో చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవులను కేటాయించినట్లు వివరించారు. రెండు వేర్వేరు సామాజికవర్గాలకు చెందిన నాయకులకు బాధ్యతలు అప్పగించడం ద్వారా సమతుల్యత పాటించేందుకు ప్రయత్నించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపికైన వంతల శాంతి, సీదరి రాంబాబు పాల్గొన్నారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం కూడా హాజరై ఎంపిక వివరాలను వెల్లడించారు. అల్లూరి జిల్లా నాయకులతో కలిసి వైఎస్ జగన్‌ను కలిసిన సందర్భంగా ఈ ప్రకటన వెలువడింది. జిల్లా పరిషత్ పదవులకు ఎంపికైన ఇద్దరు నాయకులకు పార్టీ నేతలు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీ గుమ్మ తనూజారాణి, పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త కురసాల కన్నబాబు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్సీ కుంభా రవి, పాడేరు ఎమ్మెల్యే ఎం. విశ్వేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఈ సమావేశంలో భాగస్వాములయ్యారు. వైఎస్ జగన్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ నాయకత్వ ఎంపికలకు సంబంధించిన వివరాలు అధికారికంగా ప్రకటించారు.అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా వంతల శాంతి, వైస్ చైర్‌పర్సన్‌గా సీదరి రాంబాబు ఎంపిక కావడంతో స్థానిక సంస్థల నాయకత్వ బాధ్యతలపై స్పష్టత వచ్చింది. సామాజికవర్గాల మధ్య సమన్యాయం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రేగం మత్స్యలింగం వివరించారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశం ద్వారా ఎంపికలను అధికారికంగా ప్రకటించడంతో జిల్లాకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చిన్నారుల్లో న్యుమోనియా నివారణకు 'సాన్స్' ప్రచారం పోస్టర్ విడుదల చేసిన కమిషనర్ చక్రధర్‌బాబు

- ఫిబ్రవరి 28 వరకు ప్రత్యేక కార్యక్రమం

మంగళగిరి, రాజధాని వాయిస్ ఐదేళ్లలోపు చిన్నారుల్లో న్యుమోనియా నివారణ,శిశు మరణాల తగ్గింపే లక్ష్యంగా చేపట్టిన 'సాన్స్--2026-27' ప్రత్యేక ప్రచార పోస్టర్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు గురువారం మంగళగిరిలోని తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ ప్రచారం ఫిబ్రవరి 28, 2027 వరకు కొనసాగుతుందని తెలిపారు.చిన్నారుల్లో న్యుమోనియా లక్షణాలను ముందుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. దగ్గు, వేగంగా శ్వాస తీసుకోవడం, ఛాతీ లోపలికి లాగబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. తల్లిపాలు, టీకాలు, పరిశుభ్రతతో వ్యాధి ముప్పును తగ్గించవచ్చన్నారు.

చిన్నారుల ఆరోగ్య సంరక్షణ ఆర్‌బీఎస్‌కే 2.0తో మరింత బలోపేతం

మంగళగిరిలోని ఓ హోటల్‌లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం

రాష్ట్రంలో చిన్నారులు, కౌమారదశలోని వారికి మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా జాతీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) 2.0ను మరింత బలోపేతం చేస్తున్నట్లు రాష్ట్ర కార్యక్రమ అధికారి డాక్టర్ వి.వి.బి. సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళగిరిలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆర్‌బీఎస్‌కే 2.0, ఆర్‌కేఎస్‌కే రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.చిన్నారుల్లో ఆరోగ్య సమస్యలను తొలిదశలోనే గుర్తించి, సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా వారి ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తోడ్పడటమే కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి తదుపరి పరీక్షలు, చికిత్సలు, శస్త్రచికిత్సలు అందించేలా వైద్య సేవలను సమన్వయం చేస్తున్నట్లు వివరించారు.రాష్ట్రంలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, ప్రసవ కేంద్రాలు, నవజాత శిశువుల ఇళ్ల



సందర్శనల ద్వారా చిన్నారులకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్యాధికారులు, పిల్లల వైద్య నిపుణులు, జిల్లా బాలల ముందస్తు చికిత్స కేంద్రాల సిబ్బంది సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు.నవంబర్ 9 నాటికి రాష్ట్రంలో నమోదైన 53.66 లక్షల మంది చిన్నారుల్లో 30.64 లక్షల మందికి ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా 2026--27 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు 637 శస్త్రచికిత్సలు చేపట్టినట్లు తెలిపారు. చిన్నారులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం, వైద్య సమస్యలను నిర్ధారించడం, అవసరమైన వైద్య సేవలకు పంపించడం, చికిత్స పూర్తయ్యే వరకు పర్యవేక్షించడం వంటి అంశాలపై శిక్షణ కార్యక్రమంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లా బాలల ముందస్తు చికిత్స కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు, వైద్య సిబ్బంది, ప్రత్యేక వైద్య సేవలను మెరుగుపరచాలని సూచించారు. పుట్టుకతో వచ్చే లోపాలు గుర్తించిన చిన్నారులకు శస్త్రచికిత్సలను వేగంగా నిర్వహించాలని, చికిత్స కోసం రవాణా సౌకర్యాలను సమర్థంగా వినియోగించాలని పేర్కొన్నారు.డిజిటల్ విధానంలో ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు, చికిత్స పురోగతిని పర్యవేక్షిస్తూ అర్హులైన ప్రతి చిన్నారికి వైద్య సేవలు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

సీఐఐ సదస్సులో పాల్గొన్న నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

విశాఖపట్నం, రాజధాని వాయిస్ : విశాఖపట్నంలో నిర్వహించిన ప్రతిష్ఠాత్మక సీఐఐ భాగస్వామ్య సదస్సులో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతికి సరికొత్త దిశానిర్దేశం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సదస్సులో ఆమె భాగస్వామ్యమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలపై సదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు, పారిశ్రామిక కార్యకలాపాలకు ప్రధాన గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్రంలో పరిశ్రమల విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించడం, పెట్టుబడిదారులను ఆకర్షించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులు, ప్రతినిధులు ఒకే వేదికపైకి వస్తున్నారు. రాష్ట్రంలో నూతన పరిశ్రమల స్థాపనకు ఉన్న అవకాశాలను వివరించడంతో పాటు, పెట్టుబడుల ద్వారా పారిశ్రామిక రంగాన్ని విస్తరించే అంశాలపై చర్చలకు ఈ సదస్సు వేదికగా నిలుస్తోంది. కొత్త పరిశ్రమలు ఏర్పాటైతే యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలకు ఊతం



లభిస్తుందని సదస్సు లక్ష్యాల్లో భాగంగా పేర్కొన్నారు. పారిశ్రామిక ప్రగతిని ప్రాంతీయ అభివృద్ధితో అనుసంధానిస్తూ ఉద్యోగ అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలనే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వివరించారు. నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధితో పాటు రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామిక రంగం విస్తరణకు దోహదపడే కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో లోకం నాగ మాధవి సీఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొనడం ప్రాధాన్యం సంతరించుకుంది. పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి కల్పనకు సంబంధించిన అంశాలపై సదస్సు ద్వారా రాష్ట్రానికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

తిరుపతిలో ఏరియా డామినేషన్ కార్యక్రమం

తిరుపతి, రాజధాని వాయిస్ : తిరుపతి నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల్లో భద్రతాభావం పెంపొందించడమే లక్ష్యంగా పోలీసులు ఏరియా డామినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నగరంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసుల ఉనికిని చాటడంతో పాటు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా భద్రతా చర్యలను బలోపేతం చేయడంపై పోలీసులు దృష్టి సారించారు. ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిస్థితులను పర్యవేక్షిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించడమే ఈ కార్యక్రమం ఉద్దేశంగా పేర్కొన్నారు.అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం ద్వారా ప్రజలకు భద్రతపై నమ్మకం కల్పించేందుకు పోలీసు శాఖ ప్రయత్నిస్తోంది. ఈ తరహా కార్యక్రమాలతో సమస్యాత్మక ప్రాంతాలపై నిఘా పెంచి, శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.నగరంలో ప్రజలకు భద్రత కల్పించడం, చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టడం పోలీసుల ప్రధాన బాధ్యతల్లో భాగం. ఈ నేపథ్యంలో తిరుపతిలో



నిర్వహించిన ఏరియా డామినేషన్ కార్యక్రమం ద్వారా భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంపై దృష్టి సారించారు. పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం శాంతి భద్రతల పరిరక్షణకు చేపట్టిన చర్యల్లో భాగంగా నిలిచింది. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందిస్తూ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఇటువంటి చర్యలు చేపడుతున్నట్లు పోలీసు శాఖ వెల్లడించింది.

బీటెక్ చదువుతోనే పవర్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయికి.. ప్రకాశం యువకుడు శ్రీచంద్ర ప్రతిభ

18 ఏళ్లకే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాల వేట.. జిల్లాకు గర్వకారణంగా నిలిచిన యువ క్రీడాకారుడు

ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు

ప్రకాశం, రాజధాని వాయిస్ : చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ప్రకాశం జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నాడు యువ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు శ్రీచంద్ర. కేవలం 18 ఏళ్ల వయసులోనే రాష్ట్ర, జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు, కాంస్య పతకాలను సాధిస్తూ తన ప్రతిభను చాటుతున్నాడు.బీటెక్ చదువుతున్న శ్రీచంద్ర.. ఒకవైపు విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూనే మరోవైపు కఠోర సాధనతో పవర్ లిఫ్టింగ్‌లో అంచెలంచెలుగా ఎదుగుతున్నాడు. హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న తన తండ్రి ప్రోత్సాహం, శిక్షణ, మార్గదర్శకత్వం అతడి విజయాలకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ స్థాయి క్రీడాకారుల నేపథ్యం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన శ్రీచంద్ర చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకున్నాడు.బెంగళూరు, హైదరాబాద్, కేరళ వేదికలుగా నిర్వహించిన సౌత్ ఇండియా, జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొని పతకాలు సాధించడం ద్వారా తన సత్తా చాటాడు. తక్కువ వయసులోనే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం విశేషం.శ్రీచంద్ర సాధించిన విజయాలను తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అతడిని ప్రత్యేకంగా అభినందించా



రు. చదువుతో పాటు క్రీడల్లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించి దేశానికి, రాష్ట్రానికి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ప్రోత్సహించారు.తండ్రి ప్రోత్సాహం, పట్టుదల, నిరంతర సాధనతో ముందుకు సాగుతున్న శ్రీచంద్ర ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.

మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

ఎన్నికల సన్నద్ధతపై అధికారులతో సమీక్ష నిర్వహించిన సాయికాంత్ వర్మ

నవంబర్ 26న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు

సిబ్బంది శిక్షణ, వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశం

గుంటూరు, రాజధాని వాయిస్ : మంగళగిరి--తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, పొన్నూరు మున్సిపాలిటీలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి లోపాలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ తమకు అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల అధికారి అనిల్ చంద్ర పునేఠ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన చర్యలు, ఇంకా పూర్తి చేయాల్సిన పనులపై సమీక్షించారు. నవంబర్ 26న పోలింగ్, నవంబర్ 30న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తేదీలను దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రిటర్నింగ్ అధికారి కార్యాలయాల ఏర్పాటు, ఎన్నికల సిబ్బంది నియామకం, శిక్షణ కార్యక్రమాలను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన సిబ్బంది, సామగ్రిని సిద్ధం చేసుకోవాలని చెప్పారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, వాటి నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కూడా ముందస్తుగా పరిశీలించాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంపొందించేందుకు



వీడియోగ్రఫీ, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను ప్రతి అధికారి తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు, ఎన్నికల సిబ్బందికి విధులపై స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా పంచాయతీ అధికారి నాగ సాయికుమార్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మృతి చెందిన ఏపీఎస్‌పీఎఫ్ ఉద్యోగి కుటుంబానికి రూ.3.82 లక్షల ఆర్థిక సాయం

విజయవాడ, రాజధాని వాయిస్ : విధి నిర్వహణలో ఉన్న ఏపీఎస్‌పీఎఫ్ ఉద్యోగి మరణంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబానికి తోటి ఉద్యోగులు, సహచరుల బృందం అండగా నిలిచింది. విజయవాడ ఏపీఎస్‌పీఎఫ్ గార్డ్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్ అక్టోబర్ 31న మరణించారు. ఆయన కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు సమిష్టిగా రూ.3,82,000 సేకరించి అందజేశారు.మహమ్మద్ ఖాజా మొయినుద్దీన్‌కు భార్య బషీరున్నీసాతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు ఎంబీబీఎస్ చదువుతుండగా, కుమార్తె ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. కుటుంబానికి ప్రధాన అండగా ఉన్న ఆయన మరణంతో పిల్లల చదువులు, భవిష్యత్తు బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని ఆర్థిక సహాయం అందించాలని గ్రూప్ సభ్యులు నిర్ణయించారు. 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు తమ వంతు సహకారాన్ని అందిస్తూ మొత్తం రూ.3 లక్షల 82 వేల నిధులను సమీకరించారు. ఈ మొత్తాన్ని మృతుని కుటుంబానికి అందజేయడం ద్వారా కష్టకాలంలో వారికి తోడుగా నిలిచారు. పిల్లల విద్యాభ్యాసం, కుటుంబ అవసరాలకు ఈ సహాయం ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. విజయవాడలోని ముత్యాలంపాడు జీపీపీ ఏపీఎస్‌పీఎఫ్ కార్యాల



యంలో నిర్వహించిన కార్యక్రమంలో విజయవాడ జోన్ ఏపీఎస్‌పీఎఫ్ కమాండెంట్ ముద్దాడ శంకరరావు చేతుల మీదుగా ఆర్థిక సహాయాన్ని బషీరున్నీసాకు అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగి కుటుంబానికి సహాయం అందించేందుకు ముందుకు వచ్చిన 2000 బ్యాచ్ గ్రూప్ సభ్యుల చొరవను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ ఏపీఎస్‌పీఎఫ్ గార్డ్స్ అసిస్టెంట్ కమాండెంట్ హేమసుందర్, ఇన్‌స్పెక్టర్లు, 2000 బ్యాచ్ రియల్ హెల్పింగ్ గ్రూప్ సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఉద్యోగి మరణంతో ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి సమిష్టి సహకారంతో ఆర్థిక సాయం అందించడం ద్వారా మానవీయతను చాటుకున్నారు.

పంచాయతీ ఎన్నికల వేళ గ్రామాల్లో శాంతిభద్రతలపై పోలీసుల నిఘా

గ్రామసభలు, పుట్ పెట్రోలింగ్‌తో అప్రమత్తత

కనిపించేలా పోలీసుల ప్రత్యేక గస్తీ

ఘర్షణలకు తావులేకుండా ముందస్తు చర్యలు

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: ఎస్పీ జగదీష్

అనంతపురం, రాజధాని వాయిస్ : పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు తావులేకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. శాంతిభద్రతలను పరిరక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు అధికారులకు సూచించారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో తమ ఎన్నికల కార్యక్రమాల్లో పాల్గొనేలా భద్రతా చర్యలు పటిష్ఠం చేయాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు గ్రామసభలు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. స్థానిక ప్రజలతో మాట్లాడి గ్రామాల్లో ఉన్న సమస్యలు, వివాదాలు, ఘర్షణలకు దారితీసే అంశాలను ముందుగానే గుర్తించాలని తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో రాజకీయ విభేదాలు వ్యక్తిగత గొడవలుగా మారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించేందుకు పోలీసు సిబ్బంది చొరవ చూపాలని పేర్కొన్నారు.ఫుట్ పెట్రోలింగ్‌ను విస్తృతంగా నిర్వహించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. పోలీసులు గ్రామాల్లోని ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో కనిపించేలా గస్తీ నిర్వహించాలని సూచించారు. నిరంతర పోలీసు పర్యవేక్షణ ద్వారా అవాంఛనీయ ఘటనలను ముందుగానే అడ్డుకోవచ్చని తెలిపారు. స్థానిక పరిస్థితులను బట్టి గస్తీ నిర్వహణను పర్యవేక్షిస్తూ, అవసరమైన



ప్రాంతాల్లో అదనపు అప్రమత్తత పాటించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఎన్నికల సమయంలో వ్యక్తుల మధ్య లేదా వర్గాల మధ్య వివాదాలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గ్రామాల్లో ఇప్పటికే ఉన్న విభేదాలు, పాత కక్షలు మళ్లీ తెరపైకి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు చట్టాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలని, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నాలను పోలీసులు ఉపేక్షించబోరని స్పష్టం చేశారు. ఘర్షణలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పి. జగదీష్ హెచ్చరించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించడం, ఇతరులను రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే చట్టప్రకారం వ్యవహరిస్తామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని, వ్యక్తిగత లేదా రాజకీయ విభేదాల కారణంగా గ్రామాల్లో ఉద్రిక్తతలు సృష్టించవద్దని సూచించారు.పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసు శాఖ అన్ని విధాలా అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు.

రూ.1,300కే 26 కిలోల బియ్యం పంపిణీ

కేంద్రం వద్ద లబ్ధిదారుల రద్దీ



మాచర్ల.నవంబర్ 12 రాజధాని వాయిస్ : కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకంలో భాగంగా బియ్యం పంపిణీ కార్యక్రమం కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో మాచర్లలోని పంపిణీ కేంద్రం వద్ద లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రద్దీ నెలకొంది. ఇందుకోసం ఒక్కొక్కరు రూ.1,300 చెల్లించి 26 కేజీల బియ్యం పొందుతున్నారు.బియ్యం తీసుకునేందుకు మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో క్యూ లైన్లలో నిలబడి తమ వంతు కోసం వేచి ఉన్నారు. పంపిణీ కేంద్రం వద్ద రద్దీ కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న దృశ్యాలు కనిపించాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పంపిణీ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

మంచికల్లులో ఘనంగా పడిపూజ మహోత్సవం

- ముఖ్య అతిథిగా పాల్గొన్న గౌతమ్ జూలకంటి



రెంటచింతల నవంబర్ 12 రాజధాని వాయిస్ : మంచిగ్రామంలో టీడీపీ నాయకులు గోగుల వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ అయ్యప్పస్వామి వారి పడిపూజ మహోత్సవంలో ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువనేత గౌతమ్ జూలకంటి హాజరయ్యారు. బుధవారం పొద్దుపోయే వరకు జరిగిన ఈ మహోత్సవంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిపించారు. వివిధ రకాల ద్రవ్యాలు, పూలతో శ్రీ అయ్యప్పను భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. అనంతరం మాల ధరించిన స్వాములకు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి బద్దూరి బ్రహ్మానందరెడ్డి, గోగుల పుల్లారెడ్డి, అభిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ తండ్రికి గౌతమ్ నివాళులు



వెల్దుర్తి.నవంబర్ 12 రాజధాని వాయిస్ :మాజీ ఎంపీపీ సంజీవ్ రెడ్డి తండ్రి వీరారెడ్డి ఆనారోగ్యంతో మృతి చెందగా టిడిపి యువ నేత. గౌతమ్ జూలకంటి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు కళ్లం రామాంజీరెడ్డి ఉన్నారు.

కలెక్టరేట్ గ్రంథాలయానికి రెండో రోజు పుస్తకాల విరాళం

గ్రంథాలయ అభివృద్ధికి ఉద్యోగులంతా స్వచ్ఛందంగా పుస్తకాలు అందించాలి
జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి



బాపట్ల.నవంబర్ 12 రాజధాని వాయిస్ : జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి.ఆదేశాల మేరకు ఉద్యోగుల్లో పఠనాసక్తి, విజ్ఞానాభివృద్ధిని పెంపొందించే లక్ష్యంతో కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి కనీసం ఒక పుస్తకాన్ని స్వచ్ఛందంగా అందించాలని కలెక్టర్ ఇచ్చిన పిలుపుకు స్పందనగా రెండో రోజు గురువారం పుస్తకాలు విరాళంగా అందజేశారు.ఐ అండ్ పీఆర్ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరమణ ఏడు పుస్తకాలను, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస సింగ్ ఒక పుస్తకాన్ని, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు ఒక పుస్తకాన్ని గ్రంథాలయానికి అందజేశారు. పుస్తకాలు అందించిన వారిని జిల్లా కలెక్టర్ అభినందించారు. గ్రంథాలయంలో భారత రాజ్యాంగం, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ నిబంధనలు, పరిపాలన, వ్యక్తిత్వ వికాసం, విజ్ఞానాభివృద్ధికి సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. గ్రంథాలయ అభివృద్ధికి ప్రభుత్వ ఉద్యోగులంతా స్వచ్ఛందంగా పుస్తకాలు అందించాలని కోరారు.

కనపర్రులో కార్డన్ అండ్ సెర్చ్

28 బైకులు, ఆటో స్వాధీనం





నాదెండ్ల.నవంబర్ 12 రాజధాని వాయిస్ : మండలంలోని కనపర్రు గ్రామంలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నరసరావుపేట ఏఎస్పీ ఎం.హనుమంతరావు పర్యవేక్షణలో ఉదయం 7:00 నుండి 8:30 గంటల వరకు ఈ తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో సరైన వాహన పత్రాలు లేని 28 ద్విచక్ర వాహనాలను, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఏఎస్పీ గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని, ఎలాంటి వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో ద్విచక్ర వాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సర్కిల్ సీఐ సుబ్బానాయుడు, చిలకలూరిపేట టౌన్ సీఐ రమేష్, నరసరావుపేట టూ టౌన్ సీఐ సురేంద్రబాబు, వినుకొండ టౌన్ సీఐ ప్రభాకర్, వినుకొండ రూరల్ సర్కిల్ సీఐ బ్రహ్మయ్య, నాదెండ్ల ఎస్ఐ, నరసరావుపేట సబ్ డివిజన్ ఎస్ఐలు, మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఎస్పీ సమీక్ష

బెల్లంకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన పల్నాడు ఎస్పీ జగదీష్ అదహళ్లి
పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి.. గ్రామాలు, వార్డుల్లో ముందస్తు సమాచార సేకరణకు ఆదేశాలు



పల్నాడు నవంబర్ 12 : రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల సన్నద్ధతపై పల్నాడు జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి, ఐపీఎస్ బెల్లంకొండ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, ప్రస్తుత స్థితిగతులపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆరా తీసిన ఎస్పీ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, నేరాల నియంత్రణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చట్టవ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా ఉంచి వాటిని అరికట్టాలని స్పష్టం చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని, పోలీస్ శాఖపై ప్రజల్లో మరింత నమ్మకం పెంపొందించేలా అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.రాబోయే పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని సిబ్బందికి కేటాయించిన గ్రామాలు, వార్డుల్లో క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన శాంతిభద్రతల పరిస్థితులు, సమస్యాత్మక ప్రాంతాలు, ఇతర ముఖ్యమైన అంశాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ స్పష్టం చేశారు.

పల్నాడు జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం: ఎస్పీ జగదీష్ అదహళ్లి



పల్నాడు రాజధాని వాయిస్ : పల్నాడు జిల్లాలో పంచాయతీ ఎన్నికల ను అత్యంతపారదర్శకంగా, నిష్పక్షపాతంగా మరియు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ జగదీష్ అదహళ్లి స్పష్టం చేశారు.గురువారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ఐఏఎస్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ పాల్గొని ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష జరిపారు.ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అత్యంత పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ముఖ్యంగా సమస్యాత్మక మరియు అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపట్ల ఏమాత్రంఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలందరూ ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, నిర్భయంగాఓటు హక్కునుసద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజధాని భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి: కలెక్టర్ సాయికాంత్ వర్మ

ట్రంక్ రోడ్డు విస్తరణ, ఎన్‌హెచ్-16 అనుసంధానానికి భూసేకరణ పూర్తి చేయాలి
రెండో విడత ల్యాండ్ పూలింగ్‌పై ప్రత్యేక దృష్టి.. రెవెన్యూ, సీఆర్‌డీఏ అధికారులతో సమీక్ష



గుంటూరు, రాజధాని వాయిస్ : రాజధాని ప్రాంతంలో భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్లు భార్గవ్ తేజ, కార్తీక్‌లతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని ప్రాంతంలో చేపట్టాల్సిన భూసేకరణ, రెండో విడత ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పురోగతిపై చర్చించారు.ఈ-3, ఈ-13, ఈ-15 రహదారుల నుంచి ట్రంక్ రోడ్డును విస్తరించి జాతీయ రహదారి-16కు అనుసంధానం చేసేందుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ పనులకు సంబంధించి భూసేకరణలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.రెండో విడత ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని, రెవెన్యూ, సీఆర్‌డీఏ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సంయుక్త తనిఖీలు నిర్వహించి, భూముల వివరాలు, సేకరణకు సంబంధించిన అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. భూసేకరణలో ఎలాంటి జాప్యానికి అవకాశం లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఆర్వో ఖాజావలి, ఆర్డీవో లు శ్రీనివాసరావు, రమణి, ఎస్‌డీసీలు, తహసీల్దార్లు, సీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కార్యక్రమం



రాజుపాలెం.నవంబర్ 12రాజధాని వాయిస్: గణపవరం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కంది, మొక్కజొన్న, శనగ పంటలలో సమగ్ర పోషక యాజమాన్యం మరియు సమగ్ర చీడపీడల యాజమాన్యం పద్ధతులపై రైతు అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి. వెంకట నరసయ్య,క్రోసూరు వ్యవసాయ శాఖసహాయ సంచాలకులు, పి. మస్తానమ్మ,శాస్త్రవేత్త, డాట్ సెంటర్, నరసరావుపేట డాక్టర్ సత్యగోపాల్,రైతులుపాల్గొన్నారు.

వున్నం డాక్టర్‌ను సన్మానించిన గ్రేస్ అండ్ జస్టిస్ ట్రస్టు సభ్యులు




పిడుగురాళ్ల.నవంబర్ 12రాజధాని వాయిస్ :పిడుగురాళ్ల మండల జిల్లా పరిషత్ సభ్యులుగా గెలుపొందిన వున్నం హాస్పటల్ అధినేత, జానపాడు గ్రామానికి చెందిన డాక్టర్ వున్నం దీపిక నాగ మల్లికార్జున రావు లను,గ్రేస్ అండ్ జస్టిస్ ట్రస్ట్ చైర్మన్ గంటెల జాన్ బాబు, ట్రస్ట్ సభ్యులు జానపాడు సైదా మర్యాదపూర్వకంగా కలిసి,అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా జడ్పీ చైర్మన్ గా డాక్టర్ వున్నం దీపిక నాగ మల్లికార్జున రావుకు అవకాశం కల్పించాలని కోరారు.

యూనియన్ బ్యాంక్ 108వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహణ



నరసరావుపేట.నవంబర్ 12 రాజధాని వాయిస్ : నరసరావుపేటలోని స్థానిక ఎస్.ఎన్.ఆర్. కన్వెన్షన్ హాల్‌లో, నరసరావుపేట ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంక్ 108వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రాంతీయ కార్యాలయ అధికారి ధవళ లక్ష్మీ నారాయణ అధ్యక్షత వహించారు.వేడుకలకు పల్నాడు మరియు బాపట్ల జిల్లాల నలుమూలల నుంచి బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు, యూనియన్ నాయకులు, బ్యాంకు శ్రేయోభిలాషులు, రిటైర్డ్ ఉద్యోగులు, వాల్యూయర్లు, న్యాయవాదులు, బిజినెస్ కరస్పాండెంట్లు, బ్యాంక్ ఏజెంట్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా బ్యాంక్ ఎం.డి. & సి.ఇ.ఒ. ఆశిష్ పాండే మాట్లాడుతూ, భారతీయ బ్యాంక్ ఉద్యోగులు జాతీయ రక్షణ నిధికి రూ.11.17 కోట్లు విరాళంగా అందజేసినట్లు తెలిపారు. అలాగే బ్యాంక్ సిఎస్ఆర్ కార్యకలాపాల కోసం రూ. 13.72 కోట్లు అందించిందని, ఇది సమ్మిళిత వృద్ధి, సమాజ సాధికారత మరియు జాతి నిర్మాణం పట్ల బ్యాంక్ యొక్క శాశ్వత నిబద్ధతను ప్రతిబింబిస్తుందని తెలిపారు. వ్యాపార భాగస్వాములను సమాజంతో మమేకం చేసే దిశగా పలు సూచనలు, ఏర్పాట్లు చేసినట్లు ఆయన వెల్లడించారు.అలాగే, బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా మొత్తం 108 కొత్త శాఖలను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. వీటిలో ఈశాన్య ప్రాంతంలో 25 శాఖలు, 51 సాధారణ శాఖలు, 16 యువ శాఖలు,9 స్టార్టప్ శాఖలు,7 అగ్రి వాల్యూ చైన్ ఫైనాన్స్ శాఖలు ఉన్నాయని తెలిపారు. ఈ నూతన శాఖల ద్వారా బ్యాంకింగ్ సేవలు ప్రజలకు మరింత సులభంగా, వేగంగా అందుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

నంబూరు--ఎర్రుపాలెం రైల్వే లైన్ భూసమీకరణను వేగవంతం చేయాలి కలెక్టర్ కృతికా శుక్లా



అమరావతి.నవంబర్ 12 రాజధాని వాయిస్ : నంబూరు--ఎర్రుపాలెం నూతన బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించి భూసమీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. అమరావతి మండలంలోని ఎండ్రాయి, కార్లపూడి, వైకుంఠపురం గ్రామాల్లో రైల్వే లైన్ నిర్మాణానికి మొత్తం 119.6125 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటివరకు 105.09 ఎకరాలకు సంబంధించి ఫారం-1 సమ్మతి పత్రాలు అందగా, 91.83 ఎకరాలకు ఫారం-5 ప్రక్రియ పూర్తయింది. మొత్తం 256 మంది రైతులకు గాను 245 మంది నుంచి ఫారం-1 సమ్మతి పొందగా, 210 మందికి సంబంధించిన ఫారం-5 ప్రక్రియ ముగిసింది. పెండింగ్‌లో ఉన్న భూముల సర్వే, మ్యుటేషన్, వారసత్వ వివాదాలు మరియు రెవెన్యూ సమస్యలను అధికారులు సమన్వయంతో త్వరగా పరిష్కరించి, మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com